క్లుప్తంగా

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



గట్టు: క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. చాగదోన గ్రామంలో 10వ తరగతిలో 574 మార్కులు సాధించిన చరణ్, అతని తల్లిదండ్రులను సోమవారం ఎస్‌ఐ సన్మానించి అభినందించారు. చరణ్ కేటీ మండలం ఎంజేపీ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరన్న, కానిస్టేబుళ్లు భీమేష్, బుడ్డన్న, గ్రామస్తులు పరమేశ్వరయ్య, సుదర్శన్, కొమ్ము ఏసన్న, సామేలు, దేవన్న, పకీరన్న,సవారి, దావీదు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



అయిజ: హిందూ ధర్మ పరిరక్షణ సమితి కార్యక్రమాల్లో భాగంగా విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అంబ భవానీ ఆలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం చిన్నారులకు ప్రార్థన శ్లోకాలు, పద్యాలు, దేశభక్తి గీతాలు నేర్పించారు. అదే విధంగా రామాయణం, భారతం, భాగవతం స్వాతంత్య్ర సమర యోధుల చరిత్రలు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత



ధరూరు: మండల పరిధిలో ఆయా సందర్భాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం వారి ఫోన్లు అందజేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరికి అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాలు, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరు ప్రదేశాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్: ఆయా ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ట్రేస్ చేసి సోమవారం సెల్‌ఫోన్లు అందజేశారు. బాధితులు గతంలో చేసిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లు గుర్తించి నలుగురు బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



అయిజ: అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సోమవారం మండలంలోని వెంకటాపురంలో మండల వ్యవసాయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అదే విధంగా మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఇళ్లను ఎంపీడీఓ చెన్నయ్య పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పరిశీలించారు. మల్లంపల్లి గ్రామానికి 10 ఇళ్లు మంజూరైన నేపథ్యంలో అర్హుల వివరాలతో పాటుగా పొలాలకు సంబంధించిన సమాచారం , కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని కొర్విపాడు గ్రామంలో సోమవారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారులను ఎంపిక కోసం ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంత నిర్వహణకు స్థలం కరువు

- రోడ్డుపైనే క్రయ విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- దశాబ్దాలుగా తప్పని ఇక్కట్లు



ధరూరులో రోడ్డుపైనే సంత నిర్వహిస్తున్న వైనం

ధరూరు: దశాబ్దాలుగా మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతకు స్థలం కరువైంది. ప్రత్యేక స్థలం లేక వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు జరపాల్సిన పరిస్థితి దాపురించింది. పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా స్థలం, కనీస వసతులు లేక ఇటు వ్యాపారులు అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి రైతులు కూరగాయలు, సరుకులు విక్రయించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

దశాబ్దాలుగా ధరూరులో ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలైన మన్నాపురం, బూరెడ్డిపల్లి, జాంపల్లి, సోంపురం, పారుచర్ల, దోర్నాల, ఓబులోనిపల్లి, గుర్రోనిపల్లి, కాపులకుంట తదితర గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు సంతలో కూరగాయలు, నిత్యావసరాలు, రైతులు ఎరువులు, పురుగు మందులు కూడా కొనుగోళ్లు చేస్తుంటారు.



రోడ్డుపై ఉల్లిపాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

రోడ్డుపైనే అమ్మకాలు

సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కోసం కొన్నేళ్లుగా వ్యాపారులు, ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాత బస్టాండ్ మీదుగా గట్టుకు వెళ్లే రోడ్డుపైనే క్రయ, విక్రయాలు జరుపుతున్నారు. దుమ్ము ధూళితో కూడిన కూరగాయలను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఎదురైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తగ్గుతున్న ఆదరణ

గద్వాల, మల్దకల్ మండలాల్లో జరిగే పెద్ద సంతల తరువాతి స్థానం ధరూరు సంతకే ఉండేది. నాణ్యమైన, తాజా కూరగాయలు లభించే సంతగా పేరున్న ధరూరు సంతకు రానురాను ఆదరణ కరువవుతోంది. రోడ్డుపైనే విక్రయాలు జరిపేందుకు వ్యాపారులు, ప్రజలు వెనుకడుగు వేస్తుండగా, కొనుగోళ్లు చేసేందుకు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

సంతలో మంచినీటి వసతి, మూత్రశాలలు వంటి కనీస సౌకర్యాలు కూడా అధికారులు కల్పించడం లేదు. సంత పరిసర ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సంతలో ఎదుర్కొంటున్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. సంత కోసం గతంలో పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి సూచన మేరకు సంత ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

స్థలం కేటాయించాలి



ధరూరులో నిర్వహించే వారాంతపు సంతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి. స్థలం లేక రోడ్డు, కంఢకాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో వాహన రాకపోకలతో దుమ్ము, ధూళి పెరిగి కూరగాయలపై పడి పాడవుతున్నాయి. సంబంధిత అధికారులు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, ధరూరు

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులతో సంపత్‌కుమార్

ఇటిక్యాల: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై కమిటీ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దేవస్థానాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. పాలకమండలి చైర్మన్‌గా జయసింహ, పాండురంగయ్య, ఎక్స్‌అఫిషియో మెంబర్, సభ్యులుగా వెంకటరమణ శెట్టి, నారాయణ, జయన్న, వెంకటేష్, నవిత, నాగలక్ష్మిని నియమించారు. కార్యక్రమంలో జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలిశ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ.. కేసు నమోదు



ధరూరు: మండల కేంద్రంలోని ఓ దుకాణం ఎదుట ఆపిఉన్న బైక్‌ను గుర్తు తెలియని యువకుడు దొంగిలించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్డులోని ఓ దుకాణం వద్ద అయిజకు చెందిన చాకలి వీరేష్ టీఎస్ 06 ఈజే 8725 నంబర్ గల స్పెండర్ బైక్‌ను ఈనెల 10న సాయంత్ర 5 గంటల సమయంలో ఆపి పని మీద బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని యువకుడు బైక్‌ను దొంగిలించి గట్టు మండలం వైపు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీల్లో నమోదైనట్లు పేర్కొన్నారు. బైక్ దొంగిలించిన వ్యక్తి సమాచారం తెలిపిన వారికి రూ.5వేల నగదు బహుమతి అందించనున్నట్లు సోమవారం ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 70293, 87125 25665కు తెలియజేయాలని కోరారు.

ప్రధానోపాధ్యాయులపై చర్య తీసుకోవాలి



అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాల: ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా జమ్మిచేడు, మన్నాపురం, ఉప్పేరు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోత విధించారని వీరిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు ఉప్పేరు నర్సింహ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణను కోరారు. ఈమేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జమ్మిచేడు పాఠశాలలో పనిచేస్తున్న సంతోషమ్మకు ఎనిమిది నెలలకు రూ.96వేలు రావాల్సి ఉండగా రూ.42వేలు మాత్రమే ఇచ్చారన్నారు. అదే విధంగా ధరూరు మన్నాపురం గ్రామంలోని ప్రధానోపాధ్యాయుడు మొదటి విడతలో రూ. 36వేలు వేతం ఇవ్వాల్సి ఉండగా, 18వేలు, ఉప్పేరు పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు రూ.45వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.30వేలు వేతనం ఇచ్చినట్లు వినతిలో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సదరు ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో ఉమారామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా సోమవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తేరు(ప్రభ)ను తిలకించారు. కార్యక్రయంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సహనం, సమానత్వంతో మానవాళికి మేలు



అయిజలో బుద్ధపూర్ణిమ నిర్వహిస్తున్న నాయకులు

గద్వాల: సహనం, సమానత్వంతో మానవాళికి మేలు చేకూరుతుందని, మనస్సు ఆధీనంలో ఉంచుకుంటే శాంతి నెలకొంటుందని చెప్పిన గొప్ప సామాజిక విప్లవకారుడు, ప్రజ్ఞాశీలుడు గౌతమ బుద్ధుడని బుద్ధిస్ట్ సోసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు అన్నారు. సోమవారం బుద్ధ జయంతి వేడుకలు పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక స్మృతి వనంలో బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు బుద్ధుడి మార్గాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ కృష్ణ, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వాల్మీకి, హుస్సేన్, కుర్వపల్లయ్య, ఉప్పేరు సుభాన్, వినోదాచారి, శాలన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బుద్ధ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పించారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ బుద్ధడి జీవిత చరిత్ర, గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అశోక్, గట్టు మండల అధ్యక్షుడు మోజేష్, ప్రతాప్, ప్రసాద్, ఆంజనేయులు, నరసింహులు, దేవన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సుల సేవలు మరువలేనివి



వనపర్తి రూరల్: అంతర్జాతీయ స్టాఫ్‌నర్స్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవళిక సిబ్బందితో కలిసి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు ఊర్మిళ, చరిత, బాలమణి, కేతావత్ కృష్ణ ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ అత్యవసర సమయంలో వారు అందించే సేవలు ఎంతో మంది ప్రాణాలు కాపాడాయని కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పార్వతమ్మ, రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎన్‌ఎం వెంకటమ్మ, మారి, రాజేష్‌గౌడ్, విక్టర్ రాజు, సూర్యబాబు, గౌరి, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇవ్వాలి

గద్వాల: ఎస్సీ, ఎస్టీలకు అభయహస్తం కింద రూ.12లక్షలు ఇవ్వాలని ప్రజాసంఘ నాయకులు కలెక్టర్ బీఎం సంతోష్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంబేడ్కర్ అభయహస్తం కింద ఎస్సీ,ఎస్టీలకు రూ.12లక్షలు ఇస్తామని చెప్పినట్లు వివరించారు. అదేవిధంగా అన్ని ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలలో ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. పదో తరగతి మొదలుకుని పీహెచ్‌డీ వరకు నిరుద్యోగులుగా ఉన్న వారికి రూ.10వేల నుంచి రూ.5లక్షల వరకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. దళితకుటుంబాలకు ఇంటిస్థలంతో పాటు ప్రతిఒక్కరికి శాశ్వత ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షల ఆర్థిక సాయం చేస్తామని చెప్పిన ఎన్నికల హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ప్రకాష్, కుర్వపల్లయ్య, ఆంజనేయులు, హనుమంతు, సురేష్, ప్రతాప్, మోజేష్, అశోక్ , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలొస్తే మా దృష్టికి తీసుకురండి'

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఏదుట్ల రోడ్డులో ఉన్న పునరావాస కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, తప్పనిసరిగా సౌకర్యాలు కల్పిస్తామని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ రఘు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పునరావాస కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పునరావాస కేంద్ర ఇన్‌చార్జ్ రాధికతో మాట్లాడుతూ.. వసతులు ఎలా ఉన్నాయి, ఎంతమంది స్టూడెంట్స్ వస్తున్నారనే విషయాలతో పాటు పాఠశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని, లేదంటే 15100 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పవచ్చని సూచించారు.

క్రీడలతో దేహ ధారుడ్యంతో పాటు క్రమశిక్షణ



శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో క్రికెట్ అసోసియేషన్ నాయకులు

గద్వాలటౌన్: క్రీడలతో దేహ ధారుడ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సురేష్, సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. సోమవారం స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని భరోసా ఇచ్చారు. గద్వాలలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, వారిని ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సెలవుల్లో క్రీడలు ఆడుతూ ఆనందంగా గడపాలన్నారు. చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలన్న ఉద్దేశంతో వేసవిలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్వాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఉదండాపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులే గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. రైతులు నిర్దేశిత ప్రొఫార్మా ద్వారా దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. సదస్సులో భూరికార్డుల సవరణలు, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదా బైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పట్టాదారు పాస్‌బుక్ జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, డీటీ నందిని, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ధరూరు: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి వెంకటరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మీర్జాపురం, భీంపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వ్యాధి రాకముందే టీకాలు వేయించి పశువులు వ్యాధి బారిన పడకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు టీకా పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేంద్ర, రంగస్వామి, రషీద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కేవీపీఎస్, ఆటో యూనియన్ నాయకులు

రాజోళి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెకు కేవీపీఎస్ పూర్తి మద్దతు తెలిపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు, నిర్ణయాలు మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా సమ్మెలో పాల్గొనాలని కోరారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు, ఉపాధి హామీలో రోజు కూలి రూ.600 చెల్లించేదాకా పోరాడాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో లక్ష్మన్న, మహేష్, హానోకు, కృష్ణ, దస్తగిరి సంజన్న, ఆటో యూనియన్ నాయకులు, పారిశుద్ధ్య కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం తరుగు దోపిడీని అడ్డుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల: ధాన్యం సేకరించే క్రమంలో తరుగు పేరుతో రైతులను దోపిడి చేస్తున్న కొనుగోలు కేంద్ర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వపల్లయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి నిరసన చేశారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 69 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట భారీ ఎత్తున దోపిడి చేస్తున్నట్లు తెలిపారు. బస్తాకు 40 కిలోలు తరుగు తీస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నవాజ్, మైబు, టవర్ మక్బుల్, అంజనేయులు, అంబేద్కర్, ప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కూలీలకు అవగాహన కల్పిస్తున్న నరసింహ

మల్దకల్: బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని విఠలాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్యవివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను కూలీలకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులను సామాజికంగా, ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు పంపిణీలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. రాజీవ్ యువ వికాశం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా దళితులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో దళితులకు ఇందిరమ్మ ఇళ్లను 50 శాతం కేటాయించాలని, రాజీవ్ యువ వికాసంలో పెట్టిన నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.